క్లుప్తంగా

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉపాధిహామీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య తెలిపారు. 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో జరిగిన పనులపై కొద్ది రోజులుగా పదిహేను గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాలు 14వ విడత సామాజిక తనిఖీలను నిర్వహించాయి. సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన లోపాలను బుధవారం బహిరంగ ప్రజావేదికలో చర్చిస్తామని ఎంపీడీవో తెలిపారు. ప్రజా వేదికకు మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, సెక్రటరీలు, హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ఉచిత వైద్యశిబిరం



గుంటూరు రూరల్: దంతాలు పరిశుభ్రంగా ఉంటే మనిషి ఆరోగ్యంగా ఉన్నట్టేనని చల్లావారిపాలెం సర్పంచ్ ఆరుదల సాంబశివరావు చెప్పారు. మంగళవారం గ్రామంలో టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, సాయి ఆప్టికల్స్, హ్యాపీ డెంటల్ క్లినిక్ సంయుక్తాధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ జె.సుధీర్‌కుమార్, వీఆర్వో లూర్థురాజు, ఇంటూరి సాంబశివారెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయాలి

పెదనందిపాడు: ఈనెలాఖరులోపు పన్నుల వసూలు నూరు శాతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీవో లక్ష్మణరావు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పెదనందిపాడు మండలంలో ఇప్పటికి 90 శాతం పన్నులు వసూలయ్యాయని, మిగిలినవి కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా, చెరువులను నింపాలన్నారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయి లీల, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మనబడి నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి



కాకుమాను: ప్రభుత్వం చేపట్టిన మనబడి నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ ఆదేశించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో మనబడి నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా హెచ్‌ఎంలు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చలపతి ఉన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు చార్జ్‌మెమోలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలు ఇచ్చినట్లు ఎంఈఓ సీహెచ్ రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకం అమలులో నిర్లక్ష్యం వహించినందుకు గాను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ సత్తార్, ఉపాధ్యాయురాలు షేక్ తాహేరాలకు చార్జ్‌మెమోలు ఇచ్చినట్లు వెల్లడించారు. త్రీమెన్ కమిటీ ద్వారా ఏజెన్సీని కూడా రద్దు చేసి, కొత్త ఏజెన్సీని నియమిస్తామని ఎంఈఓ రమాదేవి చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



గుంటూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని 40వ డివిజన్ పెదపలకలూరు కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల దత్తత గ్రామం పెదపలకలూరులో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పౌష్టికాహారం తదితర విషయాలపై వివరించారు. ప్రధాన కూడళ్ళలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.అనూరాధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



పెదకాకానిలో పొదుపు సంఘాల మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పెదకాకాని: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చెప్పారు. పెదకాకాని మండలంలోని వైఎస్సార్ ఆసరా మూడవ విడత ద్వారా 1,331 మంది డ్వాక్రా సంఘాల మహిళలకు మంజూరైన 10,94,00,000 రూపాయల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల జీవనశైలిలో మార్పులు రావడం, ఆర్థికంగా బలోపేతం కావడమే నిజమైన అభివృద్ధి అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే తద్వారా కుటుంబం, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. రాష్ట్రం సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా ఉందని పేర్కొన్నారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, ఏపీఎం బి.రాజు, సర్పంచులు గోళ్ళ స్వరూపరాణి, నంబూరు జ్యోతి, వేల్పుల శ్రావణి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు బందెల ఉదయ్‌శంకర్, కొంకి రామారావు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

నేడు చేబ్రోలులో..

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత కార్యక్రమం బుధవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తెలిపారు. స్థానిక పరిమి సత్యనారాయణ కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు జరిగే వైఎస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమంలో పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని వారు వెల్లడించారు.

నిర్లక్ష్యం వహిస్తే మధ్యాహ్న భోజన ఏజెన్సీలు రద్దు

ఎంపీడీఓ శ్రీరమ్య



ప్రత్తిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్లును పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీరమ్య

ప్రత్తిపాడు:మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం, అలసత్వానికి తావులేదని, ఇష్టానుసారంగా వండివార్చే ఏజెన్సీలను రద్దు చేస్తామని ఎంపీడీవో ఎ.శ్రీరమ్య హెచ్చరించారు. ప్రత్తిపాడు ఉర్దూ ప్రాథమిక పాఠశాలతోపాటు, ముస్లిం ఏరియా అంగన్‌వాడీ సెంటర్‌లో ఎంపీడీఓ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనం కోడిగుడ్లు రంగుమారి ఉండడాన్ని ఆమె గుర్తించారు. ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా ఉండడాన్ని గమనించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కానీ అక్కడక్కడా ఏజెన్సీల నిర్వాకంతో విద్యార్థులు అర్ధాకలితో ఉండాల్సి వస్తోందని ఎంపీడీఓ పేర్కొన్నారు. ఇకపై అలాంటి ఏజెన్సీలను ఉపేక్షించబోమని శ్రీరమ్య స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు జరిపి పనితీరు మార్చుకోని ఏజెన్సీలను తొలగిస్తామని తేల్చిచెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు, రిజిస్టర్లను ఎంపీడీవో పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, హాజరుతోపాటు స్టాక్ రూంను పరిశీలించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలు ఎంత మంది ఉన్నారు? వారి పట్ల ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్న విషయాలను అంగన్‌వాడీ కార్యకర్త కరీమూన్‌ను అడిగి తెలుసుకున్నారు.

తెగుళ్ల నివారణకు పుల్లటి మజ్జిగ

తయారీపై మహిళలకు అవగాహన



పుల్లటి మజ్జిగ తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): పెదగొట్టిపాడులో మంగళవారం మహిళలకు పుల్లటి మజ్జిగ తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ మహేష్ గొట్టిపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలోని డ్వాక్రా మహిళలకు పుల్లటి మజ్జిగ తయారీ విధానాన్ని వివరించారు. మహేష్ మాట్లాడుతూ మిరప పంటలో వచ్చే తెగుళ్లు, కాయకుళ్లు, కాయమచ్చలను అరికట్టేందుకు పుల్లటి మజ్జిగను పొలంలో పిచికారీ చేయాలని చెప్పారు. ఎకరానికి కిలో పెరుగు, ఐదు లీటర్ల నీటితో పుల్లటి మజ్జిగను తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు సుబ్బారావు, నరీషా, జ్యోతి, గ్రామ సంఘం లీడర్ ఝాన్సీ, గ్రామ వలంటీర్ ప్రవీణ, మహిళలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



లాం వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటనాయుడు

గొట్టిపాడు (ప్రత్తిపాడు)/గుంటూరు రూరల్: మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను చేర్చటం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.వెంకటనాయుడు పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు నగర శివారుల్లో లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆహార ప్రమాణాలు, నాణ్యతపై మహిళలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విస్తరణ సంచాలకులు మాట్లాడుతూ విలువ ఆధారిత పదార్థాల ద్వారా ఆహార వృథాను తగ్గించవచ్చని, దీని ద్వారా ఆహార భద్రత పెరుగుతుందన్నారు. ఆహారం శుద్ధిచేసి ప్రమాణాలు పాటిస్తే విలువ ఆధారిత పదార్థాలు మంచి ధరతోపాటు గుర్తింపు లభిస్తుందన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని చిరుధాన్యాలలో ప్రాసెసింగ్ పద్ధతులు పోషక విలువలతోపాటు నిల్వ చేసే విధానం ప్రాసెసింగ్ గురించి వివరించారు. ఆహారమే ఆరోగ్యానికి ప్రధానమని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కేవీ సుబ్రమణ్యం, డాక్టర్ దీప తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలు అధికం

చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ చెప్పారు. పోషణ పక్షోత్సవ్‌లో భాగంగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గొట్టిపాడు సెక్టారులోని డీడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ప్రదర్శనతోపాటు గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ వి.అరుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను తిలకించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. తక్కువ ఖర్చుతో రెట్టింపు పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ అరుణ మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా పుట్టే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సువార్తమ్మ, హెచ్‌ఎం ఎం.కళాధర్, ఏఎన్ఎం కళావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గొట్టిపాడులో పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్

- పోషణ పక్షోత్సవాల్లో భాగంగా యనమదల శివాలయం సెంటరుతోపాటు, మజ్జిగవారిపాలెం సెంటరులో సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.వి.రత్నం ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సజ్జలు, రాగులు, జొన్నలు, వరిగలు, కొర్రలు, సామలు, అండ్రుకొర్రలు, ఊదలు, అరికెలను ప్రతిరోజూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.ఉదయకుమారి, టి.బ్రహ్మమ్మలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మార్కింగ్



ప్రత్తిపాడు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ ఇస్తున్న ఎస్‌ఐ రవీంద్రబాబు, సెక్రటరీ వెంకటేశ్వర్లు

ప్రత్తిపాడు: ట్రాఫిక్‌కు విఘాతం కలిగించే ఎవరినీ ఉపేక్షించేది లేదని ప్రత్తిపాడు ఎస్‌ఐ డి.రవీంద్రబాబు తెలిపారు. ప్రత్తిపాడులో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలపై పోలీసులు దృష్టి సారించిన విషయం తెలిసిందే. తొలిరోజు ప్రతి దుకాణం, తోపుబండ్ల వద్దకు వెళ్లి రహదారిపైకి వచ్చి వ్యాపారాలు చేయడానికి వీల్లేదని, రోడ్డు మార్జిన్లకు దూరంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవాలని ఎస్‌ఐ రవీంద్రబాబు సూచించారు. దీంతో కొందరు మార్జిన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎస్‌ఐ పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వర్లుతో కలిసి మంగళవారం రోడ్డుకిరువైపులా మార్జిన్లను నిర్ధారించారు. రోడ్డు పొడవునా ప్రత్యేక మార్కింగ్ ఇచ్చారు. ఇప్పటి నుంచి మార్కింగ్ దాటి వ్యాపారాలు చేయడానికి వీల్లేదని ఎస్‌ఐ స్పష్టం చేశారు. మార్కింగ్ దాటితే కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని మరోమారు ఎస్‌ఐ స్పష్టం చేశారు.

అంతర్జాతీయ హ్యాక్‌థాన్‌లో వీవీఐటీ ప్రతిభ



హ్యాక్‌థాన్‌లో ప్రతిభ కనపరచిన మేఘన శ్రీరాంను అభినందిస్తున్న దృశ్యం

పెదకాకాని: బహుళ జాతీయ సంస్థ వర్చుని టెక్నాలజీస్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్లోబల్ హ్యాకథాన్ 'ఇంజినీరింగ్ ఈక్విటీ హ్యాక్స్'లో వీవీఐటీ విద్యార్థి మేఘన శ్రీరాం బృందం అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మొదటి స్థానం సాధించిందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మొదటి స్థానంతోపాటు 5 వేల అమెరికన్ డాలర్ల (నాలుగు లక్షల పదిహేడు వేల రూపాయల) నగదు బహుమతిని దక్కించుకుందని పేర్కొన్నారు. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడారు. రెండు విడతలుగా ఐదు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలలో ప్రపంచవ్యాప్తంగా 67వేల మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన 100 మంది విద్యార్థులు రెండో విడతకు అర్హత సాధించారన్నారు. ఐదుగురు సభ్యులు గల మేఘన శ్రీరాం బృందం మొదటి బహుమతి గెలుచుకుందని వివరించారు. కళాశాల ఐటీ విభాగంలో ఫైనలియర్ చదువుతున్న మేఘన శ్రీరాం ఇప్పటికే వర్చుసా టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ సంస్థలలో నియామకాలు సాధించినట్టు పేర్కొన్నారు. అనంతరం మేఘన శ్రీరాంను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఆళ్ల కళావతి, ఉపాధికల్పన శిక్షణాధికారి డాక్టర్ యు.మాధవయ్య, అధ్యాపకులు అభినందించారు.

గోడ దూకిన వ్యక్తికి స్థానికుల దేహశుద్ధి



చికిత్స పొందుతున్న నిందితుడు ఆంథోని

గుంటూరు రూరల్: అర్ధరాత్రి సమయంలో ఇంటి గోడను దూకిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం అంకిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నడవ ఆంథోని సోమవారం అర్ధరాత్రి సమయంలో హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన దేవలంక ప్రసాద్ ఇంటి గోడ దూకి ఇంట్లోకి వెళ్ళాడు. ఇంటి పరిసరాల్లో అలికిడి కావటంతో ప్రసాద్ లైట్లు వేసి బయటకు వచ్చాడు. అదేసమయంలో ఇంటి ఆవరణలో ఆంథోని ఉండటంతో దొంగతనానికి వచ్చాడని గ్రహించి కేకలు వేశాడు. దీంతో స్థానికులు అతనికి దేహశుద్ధి చేశారు. గోడదూకే సమయంలో నిందితుడి కాలికి గాయం కావటంతో అతడిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతనిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

ప్రసన్నాంజనేయుడికి వెండి కిరీటం బహూకరణ

ఫిరంగిపురం: 113 తాళ్లూరులోని ప్రసన్నాంజనేయస్వామికి సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామానికి చెందిన ప్రసాద్, ఆదిలక్ష్మి దంపతులు సోమవారం వెండి కిరీటం బహూకరించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో వేదపండితులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీసూక్త, పురుషసూక్తాలతో స్వామికి కిరీటాన్ని అలంకరించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషిచేయటం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో చెన్నైకి చెందిన ఏపీ సోర్స్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 55 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వార్షిక వేతనం రూ.2.5 లక్షలతో విద్యార్థులతో సంస్థ ఒప్పందం చేసుకుందన్నారు. కార్యక్రమంలో ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.

బాజీబాబా దర్గాలో హుండీల లెక్కింపు ప్రారంభం

పెదకాకాని: బాజీబాబా దర్గాలో హుండీల్లో కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం హుండీలు తెరిచారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు డెప్యూటీ సెక్రటరీ, టీం ఇన్‌చార్జి షేక్ నూర్‌సాహెబ్ పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్గాలో మొత్తం 6 హుండీలు ఉండగా ఉదయం 9:30 గంటలకు 2 హుండీలను పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో తెరిచి లెక్కింపు చేపట్టారు. ఈ లెక్కింపు కార్యక్రమం సాయంత్రం వరకూ కొనసాగింది. రెండు హుండీల ద్వారా రూ.10,88,020 లభించినట్లు దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. మిగిలిన నాలుగు హుండీలను బుధవారం లెక్కించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు సూపరింటెండెంట్ సయ్యద్ రౌఫ్, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే చైల్డ్‌లైన్ సేవలపై అవగాహన

తెనాలిరూరల్: గుంటూరు రైల్వే చైల్డ్ లైన్, తెనాలి ఆర్‌పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చైల్డ్‌లైన్ సేవలు, స్టోన్ పెల్టింగ్ ఎట్ ట్రెయిన్స్ అన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్ ఆధ్వర్యంలో స్థానిక మోరిస్‌పేటలోని ఎస్‌సీఆర్ఎస్ఎం హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ లక్ష్మి మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్తు పదార్థాలు, మద్యపానం, ధూమపానం వల్ల జరిగే నష్టాలను వివరించారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శివరామకృష్ణయ్య మాట్లాడుతూ పిల్లలు రైల్వేట్రాక్ దాటే సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చలనంలో ఉన్న రైళ్లపై రాళ్ళు విసరడం వల్ల తలెత్తే అనర్థాల గురించి చెప్పారు. చైల్డ్ లైన్ నోడల్ కో-ఆర్డినేటర్ సుగుణరాణి మాట్లాడుతూ చైల్డ్ లైన్ సేవలు, 1098 టోల్ ఫ్రీ నంబర్ ఆవశ్యకత, ఉపయోగాలను వివరించారు. రైల్వే చైల్డ్ లైన్ గుంటూరు కో-ఆర్డినేటర్ ఎ.కిషోర్ మాట్లాడుతూ పిల్లలు నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలు, బాలల హక్కులు, బాలికలపై లైంగిక దాడులు, బాలల అక్రమ రవాణా వంటి అంశాలపై వివరించారు. రైల్వే చైల్డ్ లైన్ కౌన్సిలర్ గ్లోరియా మాట్లాడుతూ పిల్లలు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒత్తిడికి గురికాకుండా ఉండే విధానాల గురించి వివరించారు. పాఠశాల హెచ్‌ఎం బషీర్‌అహ్మద్, నందన, చెల్సియా, ఆర్‌పీఎఫ్, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర సేద్యంతో మేలైన ఫలితాలు

సంగం సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఆలపాటి సత్యనారాయణ

చేబ్రోలు: వాతావరణ మార్పులు, పర్యావరణ సమస్యలు, పెరుగుతున్న జనాభాకు తగ్గ స్థిరమైన ఉత్పత్తిని సాధించాలంటే సుస్థిర వ్యవసాయంతోనే సాధ్యమని సంగం సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'క్లైయిమేట్ స్మార్ట్ అగ్రికల్చర్' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయస్థాయి కాన్ఫరెన్స్ రెండో రోజైన మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆలపాటి సత్యనారాయణ మాట్లాడుతూ సుస్థిర వ్యవసాయం ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. ధార్వాడలోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ మాజీ వీసీ ఆర్ఆర్ హంచినల్ మాట్లాడుతూ సీడ్ ఇండస్ట్రీలో ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సీడ్ ప్రొడక్షన్‌లో ఆధునిక మెలకువలను వినియోగించి విస్తృత పరిశోధనలు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్- ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె.మాథూర్ మాట్లాడుతూ పెరుగుతున్న దేశ జనాభాకు అవసరమైన వంట నూనెల్లో ఎక్కువ శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. గోధుమ, వరి, ఆహార పంటల సాగు విస్తీర్ణంతో పోలిస్తే నూనె గింజల పంటల సాగు పెరుగుదల తక్కువేనని పేర్కొన్నారు. అందువల్ల నూనె గింజల ఉత్పత్తిలో దేశ ప్రజల అవసరాలు తీర్చడానికి అనువైన పంటల సాగు చేపట్టడం, ఉత్పాదకత పెంచడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వీసీ పి.నాగభూషణ్, ఎంఎస్ రఘునాథన్, ఎం.శేషు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్విరామ సేవ



తెనాలిటౌన్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బోసురోడ్డులోని సీతారామ మందిరం ఆవరణలో మంగళవారం 50 మంది మహిళలు నిర్విరామంగా లడ్డూలు తయారు చేశారు. శ్రీరామనవమి రోజున భక్తులకు ఉచిత ప్రసాదంగా అందించేందుకు వీటిని తయారు చేయించినట్టు మందిర నిర్వహణ సేవా సంఘం కార్యదర్శి కల్లూరి సూర్యనారాయణమూర్తి, కోశాధికారి అక్కపెద్ది బాలగోపాల్, సభ్యులు వి.రత్నాకరశాస్త్రి తెలిపారు. శ్రీరామ ఆశీస్సులతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు వెల్లడించారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



మంగళ గిరి: పెదవడ్లపూడిలోని హిందూ శ్మశాన వాటికలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మారయ్యాబాబు మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పెదవడ్లపూడి శ్మశానవాటికలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి పెదవడ్లపూడి, భగత్‌సింగ్‌నగర్, బాప్టిస్ట్‌పేటకు చెందిన దిలీప్, వెంకట నాగార్జున, బి.రవిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఎస్ఈబీ ఎస్‌ఐ మల్లికార్జున్, సిబ్బంది పద్మజ, శ్రీనివాసరావు, హనుమంతు, రజని పాల్గొన్నారు.